నేడు మూసీ బాధితులకు అండగా సంతకాల సేకరణ

ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దిడ్డి సుధాకర్

కవాడిగూడ: మూసీ బాధితులకు అండగా ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో నేడు లిబర్టీ చౌరస్తా వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆప్ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. మంగళవారం లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ... ఈ సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రొఫెసర్ కె. నాగేశ్వర్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి హాజరై ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ప్రక్షాళణ, సుందరీకరణ పేరుతో మూసీ పరీవాహక ప్రాంతంలో దశాబ్దాలుగా నివసిస్తున్న పేదలను బలవంతంగా ఖాళీ చేయించడాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు. శాశ్వత పునరావాసం కల్పించిన తరువాతనే మూసీ బాధితులను ఖాళీ చేయించాలన్నారు.

◆ మూసీ ప్రాజెక్టు చేపట్టే ముందు అఖిల పక్ష పార్టీలతో సమావేశం ఏర్పాటుచేసి పర్యావరణ వేత్తలు, మేధావులు సలహాలు, సూచనలతో పాటు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మూసీ బాధితులకు న్యాయం జరిగే వరకు ఆమ్ ఆద్మీ పార్టీ దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆప్ కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాముగౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ యమునాగౌడ్, అధికార ప్రతినిధి ఖలీమ్ బాబా, దర్శనం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచే ఇంటింటి సర్వే

- జీహెచ్ఎంసీ సర్కిల్-15 పరిధిలో 66వేల నివాసాల్లో సర్వే
- సర్వేకు 588 మంది ఎన్యూమరేటర్లు, 59 సూపర్‌వైజర్లు
- ఒక్కో ఎన్యూమరేటర్ 150 నివాసాల కేటాయింపు
- 56 అంశాలతో కూడిన వివరాలను పొందుపరచనున్న సిబ్బంది


లలితానగర్‌లో శిక్షణకు హాజరైన ఎన్యూమరేటర్లు

ముషీరాబాద్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టడానికి జీహెచ్ఎంసీ సర్కిల్-15 అధికారులు సమాయత్తమవుతున్నారు. ఈ మేరకు కుటుంబ సర్వే చేపట్టనున్న ఎన్యూమరేటర్లకు 2రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. చేశారు. సర్వేలోని అంశాల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక, సంక్షేమ పథకాలు అమలు, నిధుల కేటాయింపు జరుగుతుందని సమాచారం. ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల తదితర వివరాలు నమోదు చేయనున్నారు. ముమ్మందు రాష్ట్ర ప్రభుత్వ చేపట్టబోయే వివిధ కార్యక్రమాలకు ఈ సర్వే ప్రామాణికం కానుంది. అందుకే పకడ్బందీగా చేపట్టాలని అధికార యంత్రాంగం భావిస్తోంది.

ఒక్కో ఎన్యూమరేటర్ 150నివాసాల వరకు సర్వే..



◆ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఈ నెల 6వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సర్వేలో పాల్గొనే ఎన్యూమరేటర్లు ప్రతి కుటుంబమానికి సంబంధించిన వివరాలు సేకరిస్తారు. మొత్తం సర్కిల్-15 పరిధిలోని ఆరు మున్సిపల్ డివిజన్ల (అడిక్‌మెట్, ముషీరాబాద్, రాంనగర్, భోలక్‌పూర్, గాంధీనగర్, కవాడిగూడ)లో 66వేల నివాసాలు ఉన్నాయి. ఈ సర్వేకు 588 మంది ఎన్యూమరేటర్లు, 59 సూపర్‌వైజర్లు, ఒక్కో ఎన్యూమరేటర్ 150 నివాసాల వరకు సర్వే చేపట్టనున్నారు. 56 అంశాలతో కూడిన దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అదే విధంగా ఈ సర్వేలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో), ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు పాల్గొననున్నారు. ఇందు కోసం 2రోజుల పాటు ఎన్యుమరేటర్లకు అడిక్‌మెట్ కమ్యూనిటీహాల్, జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో శిక్షణ ఇచ్చారు.

> **సర్వేకు సహకరించాలి**
>
> సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలి. వాస్తవాలతో కూడిన సమాచారాన్ని వెల్లడించి సహకరించాలి. ఇప్పటికే సర్వేకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశాం.
>
> – ఖాదర్ మొయినుద్దీన్, డీసీ

అన్ని దానాల కన్నా.. అన్నదానం మిన్న

నల్లకుంట: అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని టీపీసీసీ ఓబీసీ విభాగం వైస్ ఛైర్మన్ కట్టెల సుభాష్ పటేల్ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నేత దివంగత ఎస్. ఇంద్రసేన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబీకులు మంగళవారం అన్నదానం చేశారు. దీనికి హాజరైన టీపీసీసీ ఓబీసీ విభాగం వైస్ ఛైర్మన్ కట్టెల సభాష్, పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్ రెడ్డి, రామ్మోహన్ రావు, దేవిరెడ్డి విజితా రెడ్డి, భూదాన్ సాగర్ రెడ్డి తదితరులతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు



నల్లకుంట: కార్తీక మాసం, నాగుల చవితిని పురస్కరించుకొని మంగళవారం నల్లకుంటలోని నాగదేవత ఆలయాలు, శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. ఈ సందర్భంగా లింగాలగడ్డ శివాలయం, న్యూరామాలయంలోని పర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో మహా శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆలయాల్లో జంటనాగులకు పూజలు చేసి, పాముల పుట్టల్లో నాగేంద్రుడికి పాలు పోసి, పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: సీఎంఆర్ఎఫ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే పార్టీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. భోలక్‌పూర్ డివిజన్‌కు చెందిన 9మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.3,70,000ల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, మున్వర్ చాంద్, మహమ్మద్ ఆలీ, ముక్బుల్, చాంద్ భాషా, ప్రవీణ్ రాజ్, అస్లాం, గోవిందరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు శక్తులు సాధిస్తున్న విజయాలను తెలియజేయాలి



ఓంకార్ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గంగాధరన్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దేశంలో మతోన్మాద కార్పొరేట్ ఫాసిస్టు విధానాలను తిప్పికొట్టాలని ఎంసీపీఐయూ జాతీయ నాయకులు గంగాధరన్, కిరణ్ తేజ్, సేఖాన్ పిలుపునిచ్చారు. ఈనెల 7న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే జాతీయ సెమినార్‌ను విజయవంత చేయాలని కోరారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అనేక దేశాలలో వామపక్ష కమ్యూనిస్టు శక్తులు సాధిస్తున్న విజయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. దేశంలో లౌకిక రాజ్యాంగ విలువలను దెబ్బకొట్టేందుకు మతం పేరుతో కులాల విభజన తీసుకొని దేశాన్ని అస్థిరత్వం చేసేందుకు వెనుకాడటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్, ఎంసీపీఐ నాయకులు కాటం నాగభూషణం, గాదగోని రవి, చంద్రమోహన్‌ప్రసాద్, ఆరుణోదయ విమలక్క, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ వ్యాఖ్యలు ఖండిస్తున్నాం: ఐఎన్‌టీయూసీ

కాచిగూడ: నాడు ఓలా, ఉబర్, రాపిడో, టూ వీలర్ బైక్‌కి పర్మిషన్ ఇచ్చిన బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్ నేడు ఆటో డ్రైవర్లకు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఐఎన్‌టీయూసీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.నరసింహారెడ్డి, గోద మల్లేష్‌గౌడ్ మండిపడ్డారు. మంగళవారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ భవన్‌లో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని బదనాం చేయడానికి మంగళవారం ఇందిరాపార్క్ వద్ద ఆటో జేఏసీ ధర్నాలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేటీఆర్ ఆటో డ్రైవర్లను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. కరోనా టైంలో ఎలాంటి సాయం చేయని బీఆర్ఎస్ రోడ్ సేఫ్టీ బిల్ పేరుతో కొత్తగా రవాణా కార్మికుల మీద రుద్దిందన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కసరత్తు చేస్తున్నారని తెలిపారు.

హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు ఆందోళన చెందొద్దు



సీపీఆర్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ విజయభాస్కర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు ఆందోళన చెందకుండా చిన్న చిన్న చిట్కాలను పాటించి అందుబాటులో ఉన్న హాస్పిటల్‌లో చూపించుకోవాలని ప్రముఖ ఆర్థోపెడిక్ కో-సర్జన్ డాక్టర్ విజయభాస్కర్ సూచించారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో సీపీఆర్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ... హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు ప్రథమ చికిత్సలో భాగంగా నార్కోటిక్ ఫ్రీ అనే అంశంపై వివరించారు. హార్ట్‌ను పంపు చేయడం ప్రథమ చికిత్సలో భాగమని ఎవరికైనా అలాంటి పరిస్థితి వస్తే వెంటనే పక్కవారి సహాయాన్ని తీసుకోవాలని సూచించారు. హార్ట్ ఎటాక్ ముందు ఎడమ చేయి గుంజడం, చెమటలు రావడం తదితర లక్షణాలు కనిపిస్తాయని వెంటనే అప్రమత్తమై సమీపంలోని ఆసుపత్రిని సంప్రదించాలని కోరారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఆలోచించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, ఆధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను ఒకే కులంగా పరిగణించాలి

కాచిగూడ: బీసీ కులగణనలో కమ్మరి, వడ్రంగి, కంచరి, శిల్పి, స్వర్ణకార వృత్తులు చేస్తున్న తమ సంఘీయులను విడివిడి కులాలుగా పరిగణించకుండా పంచదాయ వృత్తులు చేస్తున్న విశ్వబ్రాహ్మణ/విశ్వకర్మలను ఒకే కులంగా పరిగణించాలని విశ్వ బ్రాహ్మణ/విశ్వకర్మ సంఘం గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ/విశ్వకర్మలను ఒకే కులంగా పరిగణిస్తూ బీసీ కులగణనలో ఎన్యుమరేట్ చేసే విధంగా తగు మార్గదర్శకాలు విడుదల చేయాలని బీసీ ప్రత్యేక (డెడికేటెడ్) కమిషన్ ఛైర్మన్ వెంకటేశ్వర్‌రావును కోరారు. ఈ కార్యక్రమంలో చొల్లేటి కృష్ణమాచారి, రాఘవ ఫణీంద్రచారి, భాస్కర్‌చారి పాల్గొన్నారు.

భూదాన్ భూములను పేదలకు పంచాలి

కాచిగూడ: భూదాన్ భూములను పేదలకు పంచాలని, అన్యాక్రాంతమైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం నారాయణగూడలో కమతం యాదగిరి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మానవ హక్కుల కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ... అనేక పోరాటాల ద్వారా భారత రాజ్యాంగంలో పౌరులకు ఉండటానికి ఇల్లు, తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్టతో పాటు స్వేచ్ఛ, సమానత్వం, రక్షణ పొందే హక్కులు కల్పించబడ్డాయన్నారు. స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్న ఈ దేశంలో కోట్లాది మంది ప్రజలకు కనీసం నివసించడానికి ఇల్లు లేకపోవడం అత్యంత విషాదకరమని అన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వాల వైఫల్యమేనని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నరసింహ, డాక్టర్ అవులప్ప, బొమ్మగాని ప్రభాకర్, ప్రొ. వినాయక్‌రెడ్డి, రవీంద్రాచారి, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రయ్య

ఆశావర్కర్లు క్రమశిక్షణతో పనిచేయాలి


భోలక్‌పూర్ యూపీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి

ముషీరాబాద్: ఆశావర్కర్లు క్రమ శిక్షణతో పని చేస్తూ ఆసుపత్రి పరిధిలో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి అన్నారు. మంగళవారం భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రలో ఆశావర్కర్ల విధి విధానాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ ..ఆశావర్కర్లు ఇంటింటికి వెళ్లి గర్భిణులు, బాలింతలను గుర్తించి వారి ఆరోగ్య వివరాలను సేకరించాలన్నారు. సమస్య ఉన్నవారికి మెరుగైన వైద్యం అందేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ టీహెచ్ఎస్ పెల్లీస్, ఏఎన్ఎంలు విజయకుమారి, సునిత, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ ఇంద్రసేన్ రెడ్డికి నివాళి



ఇంద్రసేన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ వి. హనుమంతరావు

నల్లకుంట: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నల్లకుంటలో మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దివంగత ఎస్. ఇంద్రసేన్ రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు(వీహెచ్) అక్కడ ఏర్పాటు చేసిన ఇంద్రసేన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. ఇంద్రసేన్ కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయనతో తనకున్న రాజకీయ అనుబంధాన్ని ఈ సందర్భంగా వీహెచ్ గుర్తుకు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత గూడూరు నారాయణ రెడ్డి, టీపీసీసీ ఓబీసీ వైస్ ఛైర్మన్ కట్టెల సుభాష్ పటేల్, పార్టీ సీనియర్ నాయకులు ఎస్. హరినాథ్‌రెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డి, చింతల ధనార్జున్ రెడ్డి, భూదాన్ సాగర్‌రెడ్డి, రామ్మోహన్‌రావు, ఎడ్ల నరేందర్‌రెడ్డి, కాలేరు శ్రీనివాస్‌రావు, శ్రవణ్ బొమ్మిడి, సీహెచ్. మురళీకృష్ణ, శరత్, ప్రముఖ సంఘ సేవకుడు టీ డెన్ యాదగిరి, నవీన్, మధు, లక్ష్మణ్, బోయ నరేందర్, కిషన్‌రావు, దేవేందర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులు సక్రమంగా చేపట్టాలి

వాటర్ వర్క్స్ అధికారులకు స్థానికుల వినతి


డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న జలమండలి అధికారులు

కవాడిగూడ: అరవింద్‌నగర్‌లో ఇటీవల రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించ తలపెట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను తమ ఇళ్లను ఆనుకుని కాకుండా రోడ్డు మధ్యలో నుంచి నిర్మించాలని స్థానికులు మంగళవారం వాటర్‌వర్క్స్ అధికారులకు విన్నవించారు. వాటర్ వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, బీజేపీ నేతలు జి.వెంకటేష్, అరవింద్‌నగర్ డ్రైనేజీ పనులను సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ... రోడ్డు మధ్యలో నుంచి పైపులైన్లను నిర్మించాలన్నారు. ఇళ్ల ఫుట్‌పాత్‌లను ఆనుకొని పైప్‌లైన్లు నిర్మించవద్దని డీజీఎం, బీజేపీ నేతల దృష్టికి తీసుకెళ్లారు.

◆ రోడ్డు మధ్యలో తవ్వుతుండగా భారీ బండరాయి రావడంతో 9ఫీట్ల లోతు తవ్వాల్సి వస్తోందని కొద్దిదూరం మాత్రమే రోడ్డు పక్కన పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామని జలమండలి డీజీఎం స్థానికులకు తెలియజేశారు. ఏది ఏమైనా స్థానికుల అందరి అభిప్రాయాలు తీసుకున్న తరువాతనే పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతామని డీజీఎం కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కాలనీవాసులు కూడా అభివృద్ధి పనులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్ బాబు, ప్రభాకర్ గంగపుత్ర, పరిమళ్‌కుమార్, టీఆర్ఎస్ నాయకులు రాంచందర్, వాటర్‌వర్క్స్ ఏఈ సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర కోశాధికారిగా బింగి నవీన్



ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం కోశాధికారిగా భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బింగి నవీన్ నియమితులయ్యారు. మంగళవారం ఆయనకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజ్‌కుమార్ నియమకపత్రాన్ని అందజేశారు. నవీన్ మాట్లాడుతూ.. పద్మశాలిల సమస్యల పరిష్కారానికి విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రాణించే విధంగా తన వంతు కృషి చేస్తానన్నారు. పద్మశాలీల చేతివృత్తిని, మరమగ్గాల రక్షణ ప్రధాన లక్ష్యంగా పని చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్త జనాభాలో ఆరు శాతం ఉన్న పద్మశాలీలను ప్రభుత్వాలు ఆదుకునే విధంగా కృషి చేస్తామనన్నారు. చేనేత వస్త్రాల వాడకాన్ని ప్రోత్సహించేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కమిటీలో బాధ్యతలు అప్పగించినందుకు సంఘం అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా సంఘం రాజకీయ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా డాక్టర్ ఒగ్గు సమత

కాచిగూడ: మహిళలు రాజకీయాల్లో రాణించాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పిలుపునిచ్చారు. మంగళవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో జరిగిన సమావేశంలో పద్మశాలి మహిళా సంఘం రాజకీయ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా డాక్టర్ ఒగ్గు సమత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బైరి అమరావతిని నియమించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుంటక రూపా, సంఘం ప్రతినిధులు గడ్డం జగన్నాథం, కమర్తపు మురళి, రామచంద్రం, స్వప్న రేఖ, తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాలో 12రకాల వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవళిక, సిబ్బంది

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ వైద్యుల సలహాలు తీసుకోవాలని గాంధీనగర్ టీఆర్టీ బస్తీ దవాఖనా డాక్టర్ ప్రవళిక అన్నారు. మంగళవారం బస్తీ దవాఖానాలో సాయంత్రం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని పిల్లలు, యువతులు, మహిళలు వారికి ఆరోగ్య సుత్రాలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవళిక మాట్లాడుతూ... మనం తీసుకునే ఆహారం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ బస్తీ దవాఖానాలో 12 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తామని వాటికి సంబంధించిన పరీక్షల రిపోర్టును మరుసటి రోజు మొబైల్ ఫోన్‌కు పంపిస్తామని తెలిపారు. బీపీ, షుగర్, రక్త, థైరాయిడ్, లివర్, కిడ్నీ, యూరిక్ యాసిడ్, కేన్సర్, టైఫాయిడ్, మలేరియా ఇతర పరీక్షలు కూడా నిర్వహిస్తామని అన్నారు. విటమిన్, జ్వరం తదితర మందులు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్‌నర్స్ స్వప్న, సపోర్టు నర్స్ భారతి పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరు వెంకటేష్

ముషీరాబాద్: తెలంగాణ ప్రభుత్వం పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లూరు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు రూ.7500 కోట్ల బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ టీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వరిగడ్డి చందు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడేళ్లి తిరుమలేష్, రాష్ట్ర యూనివర్సిటీల కోఆర్డినేటర్ జీవన్, ఓయూ అధ్యక్షులు నాగరాజు, కె.సురేష్, మని, ఫణిందర్, భాను, ప్రవీణ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

తొలగించారు.. కానీ తరలించరు!




డాక్టర్ చారిలేన్‌లో తొలగించిన చెట్ల కొమ్మలు



నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని పాత నల్లకుంట డాక్టర్ చారిలేన్‌తో పాటు ఇతర ప్రాంతాలో ఏపుగా పెరిగి విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను ఇటీవల విద్యుత్ శాఖ సిబ్బంది, జీహెచ్ఎంసీ హార్టికల్చర్ విభాగం సిబ్బందితో కలిసి కొమ్మలను ట్రిమ్మింగ్ చేసి తొలగింపజేశారు. తొలగించిన చెట్ల కొమ్మలను అక్కడి నుంచి తరలించకుండా నిర్లక్ష్యంగా ఎక్కడి కక్కడే వీధుల్లో కుప్పలుగా వేసి వదిలేశారు. కొందరు పారిశుద్ధ్య కార్మికులు వీధులు శుభ్రం చేస్తూ చెత్తను ఆ చెట్ల కొమ్మలు వద్దకు ఊడ్చేసి వెళ్తున్నారు. చెట్ల కొమ్మల కుప్పలను తొలగింపచేయాలని సంబంధిత శాఖ సిబ్బందికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోండం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వీధుల్లో పేరుకుపోయిన చెట్ల కొమ్మలను తొలగింపజేయాలని కోరుతున్నారు.

కులగణనతో కొన్ని వర్గాలకు అన్యాయం

కాచిగూడ: కులగణన చేసే సందర్భంలో కులాలను విభజించి వివరాలు సేకరించే పద్ధతి సరికాదని, కులగణన వల్ల కొన్ని వర్గాలకు తీవ్రమైన అన్యాయం జరిగే అవకాశం ఉందని పలు బ్రాహ్మణ సంఘాల నాయకులు గిరిప్రసాద్ శర్మ, చింతపల్లి మంగళపతిరావు, దర్శనం శర్మ, మురుకుంట్ల రాజేశ్వర శర్మ, ఉప్పల బాల సుబ్రహ్మణ్యం, పి. భీమ్‌సేన్ మూర్తిలు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం తొందరపడితే ఇరుకున పడుతుందని, అగ్ర కులాల జాబితాలో ఉండి కడు పేదరికంతో మగ్గుతున్న బ్రాహ్మణ, వైశ్య ఇతర కులాలకు అన్యాయం జరగడమే కాకుండా కులాల మధ్య విభేదాలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. బ్రాహ్మణ, వైశ్య ఇతర అగ్రకులాలలోని శాఖల జోలికి వెళ్లకుండా కేవలం రాజ్యాంగంలో సూచించిన విధంగానే కులగణన చేయాలన్నారు. రాజ్యాంగంలో ఎక్కడ ఉపకులాల ప్రస్తావన లేదని, ప్రభుత్వం ముందు ప్రజల అభిప్రాయాలు తీసుకుని తర్వాత కమిషన్‌ను నియమిస్తే బాగుంటుందన్నారు.

ఛట్ పండుగను ఘనంగా నిర్వహిస్తాం

కాచిగూడ: 'ఛట్ పూజ' సూర్య భగవానుడికి చేసే ఆరాధన పూజను నగరంలో తెలంగాణ ప్రభుత్వం సహాయంతో అన్ని ఏర్పాట్లు చేసి ఘనంగా నిర్వహించనున్నట్లు జన్‌సేవా సంఘ్ ప్రధాన కార్యదర్శి రాజీవ్ రంజన్ చౌబే తెలిపారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోశాధికారి బినీత్‌సింగ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ తెలంగాణ జైళ్లశాఖ మాజీ డీజీ వికే.సింగ్ (ఐపీఎస్) మార్గదర్శకత్వంలో నడుస్తున్న జన్‌సేవా సంఘ్ తెలంగాణ సాంస్కృతిక అభివృద్ధికి గొప్ప సహాయకారిగా ఉందన్నారు. ఛట్ పండుగ కార్యక్రమాలలో భాగంగా ఈనెల 7న సాయంత్రం, 8న ఉదయం సూర్యభగవానుడికి నదీ, సరస్సులు, నీటి వనరుల ఒడ్డున ప్రార్థనలు చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.